సొంత బండి ప్రతి ఇంటికి తప్పనిసరిగా మారింది. రోజురోజుకూ నగరం విస్తరిస్తోంది. ఔటర్‌ను దాటి పెరిగింది. కానీ ఇందుకు తగినట్లుగా ప్రజారవాణా సదుపాయలు మాత్రం విస్తరించలేదు. దీంతో నగరానికి దూరంగా ఉండి ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవసరాల కోసం రాకపోకలు సాగించేవాళ్లు సొంత వాహనాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పుడు ప్రతి మనిషికి ఒక మొబైల్ ఫోన్ అనివార్యమైంది. అదే విధంగా యువత **80** శాతం మందికి బైక్ కూడా తప్పనిసరిగా మారింది. చదువు, ఉద్యోగ, వ్యాపార అవసరాలతో నిమిత్తం లేకుండా ఒక వయస్సుకు రాగానే పిల్లలకు బండి కొనివ్వడానికి తల్లిదండ్రులు గొప్పగా భావిస్తున్నారు. రవాణా శాఖలో నమోదైన **78** లక్షల వాహనాల్లో సుమారు **50**లక్షల వరకు బైక్‌లే కావడం ఇందుకు నిదర్శనం.

# భారీగా పెరుగుతున్న సొంత వాహనాలు

### గ్రేటర్‌లో 78.5లక్షలు దాటిన వాహనాలు

### ఇందులో 50 లక్షల వరకు బైక్‌లే



హైదరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త : నగరంలో సొంత వాహనాల సంఖ్య భారీగా పెరుగుతు న్నాయి. ఇప్పటి వరకు సుమారు 78.5లోల వాహనాలు నమోద య్యాయి. కోటిన్నరకు చేరుకున్న నగర జనాభాలో సగానికి పైగా వాహనాలు ఉన్నాయి. బైక్‌ల సంఖ్య బాగా పెరిగింది. ఆ తర్వాత వ్యక్తిగత కార్ల వినియోగం కూడా బాగానే నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్టీఏ గణాకాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు కోటి 53.5లక్షల వాహనాలు నమోదు కాగా, అందులో సగానికి పైగా గ్రేటర్ హైదరాబాద్‌కు చెందినవే కావడం గమనార్హం. ఉద్యోగ, వ్యాపార అవసరాల దృష్ట్యా నగరవాసులకు సొంత వాహనం తప్పనిసరిగా మారింది. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాల్లో కార్ల వినియోగం పెరిగింది. సాధారణంగా ప్రతి సంవత్సరం లక్ష నుంచి 1.25 లక్షల వరకు వాహనాలు కొత్త వాహనాలు వచ్చి చేరుతాయి. మూడేళ్లుగా ఏటా సుమారు రెండు లక్షల వరకు కొత్త వాహనాలు నమోదవుతున్నాయి. ఈ మూడేళ్లలోనే వాహనాల సంఖ్య 72లక్షల నుంచి 78 లక్షలకు పెరిగినట్లు ఆర్టీఏ అధికారులు తెలిపారు.

కుటుంబ అవసరాల కోసం బస్సులు, రైళ్ల కంటే సొంత వాహనాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో ప్రస్తుతం నగరంలో 23లక్షలకు పైగా వ్యక్తిగత కార్లు నమోద య్యాయి. ఆటో రిక్షాలు, క్యాబ్‌లు, సరుకు రవాణా వాహనాలు, స్కూల్ బస్సులు, ఆర్టీసి, ప్రైవేటు బస్సులు తదితర కేటగిరీలకు చెందినవి సుమారు 5లక్షల వరకు ఉన్నాయి. గతంలో ఘట్‌కేసర్, హయత్‌నగర్, మియాపూర్, బిహెచ్‌ఈఎల్, కీసర వంటి దూర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చేవారు సిటీ బస్సులపై ఆధారపడేవాళ్లు. కానీ ఇప్పుడు శివార్ల నుంచి కూడా ఎక్కువ మంది సొంత వాహనాల్లోనే నగరానికి వస్తున్నారు. ప్రతి రోజు సుమారు నాలుగున్నర లక్షల మందికి మెట్రో రైలు సేవలు అందజేస్తున్నప్పటికీ మెట్రో మార్గాలకు ఫీడర్ సర్వీసులు లేకపోవడం వల్ల సొంత వాహనాలపైనే మెట్రో స్టేషన్లనకు రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

## మాదాపూర్‌లో టిప్పర్ లారీ బీభత్సం

### టిప్పర్, బండరాళ్లు నడిరోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్ జామ్



టిప్పర్ బోల్తా పడడంతో రహదారికి అడ్డంగా పడిపోయిన బండరాళ్లు

సైబరాబాద్ ప్రతినిధి, జూన్ 26 ప్రభాతవార్త : బండరాళ్ల లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ నడిరోడ్డుపై బీభత్సం సృష్టించింది. మాదాపూర్‌లో నడిరోడ్డుపై టిప్పర్ లారీ బోల్తా పడడంతో అందులో ఉన్న బండరాళ్లు, టిప్పర్ లారీ రహదారికి అడ్డంగా పడిపోయి తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి 11 గంటల ప్రాంతంలో మాదాపూర్ సైబర్ టవర్స్ నుంచి జెఎన్‌టియు వైపు ఓ టిప్పర్ లారీ (టిఎస్12 యుడి9661) భారీ బండరాళ్ల లోడుతో వెళ్తుంది. ఈక్రమంలో మార్గ మద్యలో హెచ్‌సి పెట్రోలు పంపువద్ద అదుపు తప్పిన టిప్పర్ రహదారి మద్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ క్రమంలో రహదారికి అడ్డంగా టిప్పర్ పల్టీ కొట్టడంతో అందులో ఉన్న బండరాళ్లు సైతం రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. కాగా ప్రమాద సమయంలో వాహనదారులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. రహదారికి అడ్డంగా రాళ్ల పడిపోవడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో మాదాపూర్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని టిప్పర్‌తో పాటు బండరాళ్లను తొలగించారు. ఈమేరకు టిప్పర్ డ్రైవర్ గణేష్ సాహ్రాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# హైదరాబాద్ వార్త

# తూకాల్లో దగా.. మాంసంలో మోసం

### మాంస ప్రియులను నట్టేట ముంచుతున్న వ్యాపారులు ❒ కిలో కొంటే వచ్చేది 850 గ్రాములే



హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త: మాంసానికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కొంతమంది వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతూ మాంసంప్రియులను నట్టేటా ముంచుతున్నారు. అంతేకా కుండా కొంత మంది అనారోగ్యంతో ఉన్న, చనిపోయిన మేకలు, గొర్రెలను తీసుకువచ్చి వాటిని వధించి విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చలగాట మాడుతున్నారు. గత కొంత కాలంగా జంట నగరాల్లోనివలు ప్రాంతాల్లో మాంసం విక్రేతలు మోసాలకు పాల్పడుతున్నారు. మాంసం తూకం వేయడానికి ఎలక్ట్రానిక్ తూకాలను (వేయింగ్ మిషన్) ఏర్పాటు చేసుకోవాలని తూనికలు కొలతల శాఖ అధికారులు ఆదేశించినా దుకాణాదారుల్లో చాలామంది మామూలు తూకాలు( తరాజు) వాడుతున్నారు. అలాగే తూకాల్లో బాట్లు నిర్ణీత గడువు ముగిసినప్పటికీ వాటిని కొత్తగాముద్రించి వాడటానికి దుకా ణాదారులు ఆసక్తి చూపడంలేదు. మాంసం గిరాఖీ ఎక్కువగా ఉండే ఆది వారం, పండుగరోజుల్లో ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. నగరంలో ఎక్కువ శాతం ఆదివారం రోజునే మాంసప్రియులు మాంసాన్ని కొనుగోలు చేస్తారు. ఇదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు అందినకాడికి దోచుకుంటూ వినియోగదారులను మోసం చేస్తున్నారు.

ఇటీవల తూనికలు కొలతల అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో గల చికెన్, మటన్, ఫిష్ షాపుల్లో విస్త్రత దాడులు నిర్వహించగా మాంస వ్యాపారుల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఎలక్ట్రానిక్ కాంటాపై తూకం వేసి కిలో(1000గ్రాములు) మాంసం కొనుగోలు చేసిన ఓవినియోగదారుడుకి తన చేతికి అందే సరికి అది తక్కువగా కనుబడటంతో వేరొక కాంటాపై కొలిచిచూడగా అది 850గ్రాములుగానే కనబడింది. దీంతో ఆవినియోగదారుడు తాను తూకంలో మోసపోయానని గుర్తించి తూనికలు కొలత అధికారులకు వాట్సప్ ద్వారా తెలియజేసాడు. దీంతో ఆమాంసం దుకాణాలపై అధికారులు దాడులు నిర్వ హించగా తూకాల్లో మోసాలకు పాల్పదు తున్నట్లు తేలడంతో వారిపై కేసులు నమోదు చేసారు. ఇలా నగరంలోని చాలా దుకాణాల్లోని వ్యాపా రులు వినియోగదారుల జేబులకు చిల్లుపెడుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాల్లో తక్కువ తూకం సెట్టింగ్ చేసి మోసాలకు పాల్ప డుతున్నారు. ఆదివారం నగరంలోని అంబర్‌పేట్, యూసఫ్ గూడ, ఫల క్‌నుమా, సికింద్రాబాద్ ప్రాంతంలో తూనికలు కొలతల అధికారులు దాడులు నిర్వహించి 35కేసులు నమోదు చేశారు. కిలో మాంసానికి 100గ్రాములు తక్కువగా తూకం వేస్తున్నట్లు గుర్తించారు. ఎలక్ట్రానిక్ కాంటాపై 900గ్రాముల చికెన్ పెడితే 1000గ్రాములు ఉన్నట్లుగా డిస్‌ప్లేలో చూపిస్తుంది. ఆదే 1000 గ్రాముల చికెన్ పెడితే 1100గ్రాములుగా చూపిస్తుంది. దీంతో ఆ దుకాణదారుడు 100గ్రాములు ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. 10కిలోల చికెన్‌కు కిలో చికెన్ తక్కువగా వస్తున్నట్లు పసిగట్టారు. దీంతో ఆదుకాణాలపై కేసులు నమోదు చేశారు. మరో ఆరుగురు దుకాణదారులు వేయింగ్ మెషన్‌లు రెన్యూవల్ చేయకుండానే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. తూకంలో మోసాలకు పాల్పడుతున్నట్లు వినియోగదారులు తమదృష్టికి తీసుకురావాలని వ్యాపారులపై కఠిన చర్యలు తీసకుంటామని అధికారులు తెలుపుతున్నారు.

## 'ఉప్పల్ స్కైవాక్'ను ప్రారంభించిన మంత్రి కెటిఆర్



హైదరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త : నగరంలోని ఉప్పల్ చౌరస్తాలో నిర్మించిన స్కైవాక్‌ను సోమవారం మంత్రి కెటిఆర్ ప్రారంభిం చారు. కాలినడకన రోడ్డు దాటేవారి కోసం హెచ్ఎం డిఎ దీన్ని నిర్మించింది. 660 మీటర్ల మేర ఏర్పాటు చేసిన ఈ స్కైవాక్‌కు మొత్తంగా రూ. 25 కోట్లు కేటాయించారు. నాలుగు వైపుల నుంచి నేరుగా ఉప్పల్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, రామంతాపూర్ రహదారులతో పాటు మెట్రో స్టేషన్‌కు ఈ వంతెనను అనుసంధానించారు. ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి 25-30వేల మంది నిత్యం ప్రయాణిస్తుంటారు. అలాగే రింగు రోడ్డులో రాకపోకలు సాగించే పాదచారుల సంక్య సుమారు 20వేల మంది వరకు ఉంటారు. వీరిలో మెట్టు ఎక్కలేని వారి కోసం ఎస్క లేటర్లు, లిఫ్ట్‌లు ఏర్పాటు చేశారు. స్కైవాక్‌పైన కింద పరిసర ప్రాంతాల్లో సిసిటీవీలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. ఇక గ్రీనరీ, పాదచారుల కోసం టాయిలెట్లను అందుబాటులోకి తెచ్చారు. నడిచివెళ్లేవారికి రక్షణ కోసం ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేవారు. ఇక్కడ అమర్చిన ఎల్ఈడీ దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పైన కూడా ఎండ తగలకుండా ఉండేందుకు విదేశాల నుంచి తెప్పించిన రూమ్‌లను ఏర్పాటు చేశారు.

## స్వీయ కవితాగానంతో హోరెత్తిన త్యాగరాయ గానసభ

చిక్కడపల్లి, జూన్ 26 ప్రభాతవార్త: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో 'నెలనెలా తెలుగు వెన్నెల' 175వ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న 'తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు' సందర్భంగా ప్రత్యేక కవిసమ్మేళనం కార్యక్రమం లబ్ద ప్రతిష్ఠులైన కవులతో పాటు వర్ధమాన, ప్రవర్ధమాన కవులు తమ కవితలను వినిపించే కార్యక్రమం నిర్వాహక సంస్థ మేనేజింగ్ ట్రస్టీ, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో జరిగింది.

## నవసరభరితం తల్లికుమార్తెల కూచిపూడి అరంగేట్ర నాట్యవందనం



తల్లీకుమార్తెల కూచిపూడి ఆరంగేట్ర నాట్యవందనం

రవీంద్రభారతి, జూన్ 26 ప్రభాత వార్త : ప్రఖ్యాత నృత్యగురువు నాట్యవిశారద దొడ్డ బాలాజీకుమార్ శిష్యులు, తల్లీకుమార్తెలైన వందన వెంకట్, వేదల కూచిపూడి అరంగేట్రం నాట్యవందనం శీర్షికన ఆరంగేట్రంలో ఒకరికొకరు పోటీపడుతూ తమకుతామే సాటి అనేరీతిలో వివిధ అంశాల నృత్యవిన్యాశాలతో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అశేష ప్రేక్షకుల సమక్షంలో రసరమ్యం, నవరసభరితంగా సాగి మంత్రముగ్ధులను చేసింది. గృహిణి వందన భర్త ప్రోత్సాహంతో శాస్త్రీయ కూచిపూడి నృత్యాన్ని వివాహానంతరం గురువు బాలాజీకుమార్ వద్ద కొనసాగించి సంపూర్ణ పరిణతి సాధించడమే కాకుండా చిన్నారి కుమార్తె వేదకు 5సంవత్సరాల ప్రాయం నుండే తానే తొలిగురువుగా నాట్య అడుగులకు శ్రీకారంచుట్టి 7వ సంవత్సరం నుండి తన గురువు బాలాజీకుమార్ వద్దనే కూచిపూడి నృత్యశిక్షణపొందుతూ నేడు తల్లికుమార్తెల ద్వయం జాతీయ కళామందిరంలో రవీంద్రభారతి వేదికపై కూచిపూడి నృత్యప్రదర్శనను ముందుగా భజమానస గణేష వందనంతో ప్రారంభించి మరకమణిమయ చేల కీర్తన; అలరులు కురియగ అన్నమాచార్య కీర్తన, బ్రోచేవారెవరురా వాసుదేవకృతి, మహేశ్వరి మహాకాళి దేవిశృతి, నల్లనాయకన్న యశోదకృష్ణ, చివరిగా భో శంభో దయానంద సరస్వతి కీర్తన అంశాలతో శృతి లయబద్ధంగా, అద్భుత హావభావాలు, ముఖకవళికలతో నృత్యాభినయం కావించి ఆహుతులకు కన్నులపండువ చేసి శుభాభినందనలు పొందారు. నాట్యగురువు బాలాజీకుమార్ నట్టువాంగం, నృత్యదర్శకత్వం వహించగా నతీష్ నారాయణరావు ఘట్టం; జి.ప్రమీల గాత్రం; నాగేశ్వర్‌రావు మృదంగం; సాయి కొలంక వయోలిన్; సుధాకర్ వీణ; వెంకట్ వేణువులతో వాద్యసహకారం అందించి నాట్యవందనాన్ని మరింత రక్తికట్టించారు.

## విద్యార్థుల ఆత్మహత్యను నివారించే బాధ్యత ప్రభుత్వానిదే

### '28న చలో బాసర ట్రిపుల్ ఐటి':దిడ్డి సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దిడ్డి సుధాకర్

సైఫాబాద్, జూన్ 26 ప్రభాతవార్త: బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటి ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఐఐఐటిలో విద్యార్థులు, కార్పోరేట్ కళాశాల విద్యార్థులు వరుస ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే నివారించే బాధ్యతను వహించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. ఐఐఐటి యాజమాన్యం విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండ కేవలం అధికంగా విద్య వత్తిడి చేయడం వల్లనే విద్యార్థులు భయాందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆప్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మహత్యలు నివారించి, విద్య వత్తిడిని తగ్గించి కనీస సౌకార్యలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తమ పార్టీ రాష్ట్ర కోర్ కమిటి సభ్యుడు బుర్రా రాముగౌడ్ నేతృత్వంలో ఈ నెల 28 'చలో బాసర ట్రిపుల్ ఐటి' ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తు గురి ంచి భవ్యమైన కలలు కని ఐఐఐటిలో చేరిన విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు చేసుకోవడం మనసులను కలచివేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం వినాశకరమైన విద్యా విధానాలేనని, భావి భారతదేశానికి నిజమైన సంపద విద్యార్థులేనని, వారికి ఏలాంటి వత్తిడి లేకుండా నాణ్యమైన విద్యను అందించడ ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను అందించి ప్రపంచ మేధావుల ప్రశంసలు అందుకుం టున్నదని ఆయన గుర్తు చేశారు. బుర్రా రాముగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలతోపాటు కార్పోరేట్ కళాశాలలు కూడా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కళాశాలలు నడుపుతూ విద్యార్థులకు సరైన వాతావరణం లేకుండా వపరీతమైన చదువు వత్తిడికి గురిచేస్తున్నాయని ఆరోపించారు. డా.సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఈ నెల 28న చలో బాసర ట్రిపుల్ ఐటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రవీణ్ గౌడ్, పరీక్షణ్‌రాజు, టి.రాకేష్‌సింగ్, ఎండి మొబిన్, తేజ, సోహైల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగూడలో ఇంటింటి ప్రచారం చేసిన బిజెపి నాయకులు



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో మహా జన సంపర్క్‌లో భాగంగా కేంద్ర పథకాలను ప్రజలకు తెలుపుతున్న నాయకులు

నార్సింగి, జూన్ 26 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారంను నిర్వహించారు. సోమవారం మహాజన సంపర్క్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పతకాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మైలార్‌దేవుపల్లి కార్పోరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ హయాంలోనే భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గత 7.దశాబ్దాల కాంగ్రెస్ హయాంలో అన్ని సౌకర్యాలు, శక్తి, చైతన్యం మన వద్ద ఉన్నా నేతల అలసత్వం వలన అభివృద్ధికి దూరమయ్యామని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయాల పట్ల ప్రపంచ దేశాలన్నీ కొనియాడు తుంటే.. మనదేశంలోని ప్రతిపక్షాలు అధికారం కోసం అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. భారత కీర్తి, ప్రతిష్టలను అవని అంతటికి వ్యాపింపచేయడంలో నరేంద్రమోడీ చతురత దాగుందన్నారు. 9.ఏళ్ల మోడీ పాలనలో ఒక్క రూపాయి అవినీతి జరుగలేదని, పారదర్శకమై, ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నార న్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో సైతం బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేస్తున్నారన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శ్రీధర్, ప్రేమ్‌రాజ్, మహాలింగంగౌడ్, మల్లేష్ యాదవ్, కార్పోరేషన్ బిజెపి అధ్యక్షులు కొండె మహేష్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, కార్పోరేటర్ ప్రశాంత్ నాయక్, నాయకులు ప్రవీణ్, పవన్‌సాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే నార్సింగి, మణి కొండ మున్సిపాలిటీలో సైతం అధ్యక్షులు బిక్షపతి యాదవ్, సిద్దప్ప నాయకత్వంలో మహా జన సంపర్క్ కార్యక్రమాలు నిర్వహించారు.

# ధరల దడ!

- మండిపోతున్న కూరగాయలు
- పచ్చి మిర్చి రూ.150
- టమాటా ధరలకు రెక్కలు (రూ.100)
- సామాన్యుల విలవిల

**కూరగాయల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, సికిం ద్రాబాద్ మోండా, మాదన్నపేట వంటి మార్కెట్‌లతో పాటు గ్రేటర్ పరిధిలోని 11 రైతు బజార్లకు రోజువారీగా దిగు మతి కూరగాయల రాక తగ్గిపోయింది. దీంతో ధరలు విపరీతంగా పెరిగాయి. నగర జనాభా ప్రకారం ప్రతి రోజు సుమారు మూడు వేల టన్నుల కూరగాయలు అవసరం. నగరానికి కూరగాయ దిగుమతి తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా కర్నూలు, చిత్తూరు, అనం తపురం, కర్ణాటకలోని చిక్‌బల్లాపూర్ నుంచి దిగుమతి అవుతాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయల దిగుబడి భారీగా తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.**



హైదరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త : కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరీ ముఖ్యంగా మిర్చి రేటు ఘాటెక్కిస్తోంది. ముట్టుకోకుండానే మంటెక్కిస్తోంది. రైతు బజారులోనే కిలో రూ.120 పలుకుతున్న పచ్చిమిర్చి.. ఇళ్ల దగ్గర దుకాణాల్లో మాత్రం పరేషాన్ చేస్తోంది. ఒక్కోచోట 150 రూపాయలు కూడా పలుకుతోంది. ఇక టమాటా కిలో 80 రూపాయలకు లేదు. ఇవి మాత్రమే కాదు..బీరకాయ, బీన్స్, వంకాయ ఏవి కొనాలన్నా జేబులకు చిల్లులు తప్పడంలేదు. నోరు కట్టేసుకుందామంటే కుదరదు. కనీసం చారు, సాంబారుతో కానిచ్చేద్దామనుకున్నా..ఒక్క టమాటా అయినా వేయకపోతే రుచి ఉండదు. సాంబారు నీళ్లకూ కష్టకాలమొచ్చిందిలా అని జనం అల్లాడిపోతున్నారు. ఒకప్పుడు 200 పెడితే కూరగాయలతో సంచి నిండిపోయేది. ఇప్పుడు వెజిటబుల్స్‌ను హ్యాండ్ బ్యాగుల్లో సర్దాల్సి వస్తోంది. కూరగాయల ఉత్పత్తి బాగా తగ్గడంతో కాయగూరల ధరలు మండుతున్నాయి. మార్కెట్‌లో కూరగాయలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. వారం రోజుల క్రితం వరకు టమాట ధర రూ.80 నుంచి రూ.100 వరకు చేరింది. పచ్చి మిర్చి, టమాట మినహా ఏది కొన్నా కిలో రూ.80 నుంచి రూ.100 వరకు తక్కువ లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడే ధరలు ఎలా ఉంటే వర్ష కాలంలో ఇంకా ఎక్కువగా పెరిగే అవకాశం ఉంది. ఇంట్లో నలుగురైదుగురు కుటుంబసభ్యులు ఉంటే రోజు కిలో చొప్పున కూరగాయల వినియోగం ఉంటుంది.

మార్కెట్లో వీటి ధరల బోర్డును చూసిన జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇలా అయితే కూరగాయలు కొనేది ఎలా అంటూ వాపోతున్నారు. అసలే పన్నుల భారం, దీనికి తోడు పెట్రోల్ ధరలతో పాటు కూరగాయలు, ఆకుకూరలు కూడా వాతపెట్టడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. టమాటా, ఉల్లిగడ్డ డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేకపోవడంతో ధర పెరిగిపోతోందని వ్యాపారులు చెబుతున్నారు. కొత్త పంట చేతికి రావడానికి మరో రెండు నెలలు పడుతుందని అప్పటి వరకు ధర పెంపు తప్పదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక వ్యాపారులు ఎక్కువగా చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటకలోని కొలార్, చిక్‌మంగళూర్‌లపై ఆధారపడి అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటారు. అయితే అక్కడ పంట సాగు పూర్తిగా తగ్గిపోయింది. ఇక మన రాష్ట్రంలో పంట సాగు తక్కువగా ఉంది. అది కూడా మెదక్, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాలో మాత్రమే టమాటా సాగవుతోంది. ఈ జిల్లాల నుంచి హైదరాబాద్ మార్కెట్లకు రోజుకు సుమారు 600-800 క్వింటాళ్ల మేర టమాట వస్తుంది. అయితే ఒక్క హైదరాబాద్ దినసరి టమాటా వినియోగం సగటున 5వేల క్వింటాళ్ల నుంచి 6వేల క్వింటాళ్లు ఉంటుంది. దీంతో డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేకపోవడంతో ధరలు పెంచుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజార్లలో ఒకరేటు, బస్తీల, కాలనీలలో కూరగాయల మార్కెట్‌లలో మరోరేట్లు ఉంటున్నాయని ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకోవా లంటున్నారు. రాజకీయ పార్టీలు ఎన్ని ఉన్నా ధరలు తగ్గించేం దుకు ఏ ఒక్కరు కృషిచేసిన పాపాన పోలేదంటున్నారు. ఏంకొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదని సామాన్యులు వాపోతున్నారు.

## వార్డు కార్యాలయాలతో సుపరిపాలన

### డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి



వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి

తార్నాక, జూన్ 26 ప్రభాతవార్త: వార్డు కార్యాలయాల ప్రారంభంతో ప్రజలకు మరింత చేరువలో సుపరిపాలన సాగుతుందని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. శాంతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మోతె శోభన్‌రెడ్డితో కలిస సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ చొరవ తో ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యాలయం ప్రారంభంతో అన్ని విభాగాల అధికారులు ఒకే చోట ఉంటారని ప్రజలకు వెంటనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏఎంసీ హేమలత, ఏసీపీ ముంతాజ్ బేగం, డిజీఎం సరిత, సానిటేషన్ సుపర్ వైజర్ ధనాగౌడ్, ఎంటమాలజీ సిబ్బంది రాజశేఖర్, నాయకులు ఊర్మిళతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్న ప్రభుత్వం



హోంమంత్రిని కలిసినపాతబస్తీ బిఆర్ఎస్ నాయకులు

చార్మినార్, జూన్ 26 ప్రభాతవార్త : బిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్నదని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. యాకుత్‌పుర నియోజకవర్గంతో పాటు పాత బస్తీకి చెందిన బిఆర్ఎస్ నాయకులు హోంమంత్రి మహమూద్ అలీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనిన రంగాలలోను అభివృద్ధి సాధించిందని తెలిపారు. యాకుత్‌పుర నియోజకవర్గం మాజీ బిఆర్ఎస్ ఇంఛార్జి మహ్మద్ షబ్బీర్, బిఆర్ఎస్ యాకుత్‌పుర నియోజకవర్గం యూత్ ప్రెశిడెంట శివయాదవ్, గౌలిపుర మహంకాళి ఆలయ కమిటి మాజీ చైర్మన్ తిరుపతి నర్సింరావు, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు తినుపతి శివకుమార్, ఐఎస్ సదన్ మాజీ అధ్యక్షులు మన్నే శ్రీ రంగం పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలు నివారణకు సమిష్టి కృషి అవసరం



మాదక ద్రవ్యాలు నిర్మూలనపై ప్రసంగిస్తున్న ఎసిపి

**ఎసిపి రామలింగ రాజు**

అల్వాల్, జూన్ 26 ప్రభాతవార్త: మాదక ద్రవ్యాలు నిర్మూలనలో పౌర సమాజం పోలీసు యంత్రాంగానికి సహకరించాలని పేట్‌బషీరాబాద్ ఎసిపి రామలింగ రాజు కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఓల్డ్‌అల్వాల్ బాలుర పాఠశాలలో మహిళా శిశు, వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమం, పోలీసు శాఖల అద్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. అంతకు ముందు పట్టణ పరిధిలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎసిపి రామలింగ రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరదాగా పారంభమై వ్యసనంగా మారడం పెద్ద కష్టం కాదని భవిష్యత్తును ఇవి చిన్నాభిన్నం చేస్తాయని పేర్కొన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలు సమాచారం ఉంటే 100 నెంబరుకు ఫోన్ చేయాలని ఆయన కోరారు. మాదకద్రవ్యాలు జోలికి వెళ్ళమని ఆయన విద్యార్థులుతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్మమంలో సడిపిఓ స్వాతి, సిహెచ్‌ఓ రాము, ఎక్సైజ్ ఎస్‌ఐ యూసఫ్, హెచ్‌ఎంలు సంద్యారాణి, రమాదేవి, అంకయ్య, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులు యధా విధిగా కొనసాగేందుకు చర్యలు

**సిఈఓ మధుకర్ నాయక్**



బోయిన్‌పల్లి సంచారపురి కాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సిఈఓ మధుకర్ నాయక్ తదితరులు

కంటోన్మెంట్, జూన్ 26 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు బోయిన్‌పల్లి సంచారపురి కాలనీలో కొనసాగుతున్న డ్రైనేజీ పనులు యధా విధిగా కొనసాగేటట్లు చర్యలు తీసుకుంటామని బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ హామీ ఇచ్చారు. సంచారపురి కాలనీ ఫేస్ -1 లో 14 లక్షల రూపాయల వ్యయంతో కొనసాగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం పనులను ఈ నెల 24న ఆర్మీ, మిలటరీ అధికారులు అడ్డుకున్నారు. ఆందోళనకు గురైన కాలనీ వాసులు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన సిఈఓ దృష్టి తెచ్చి పరిస్థితిని వివరించారు. సోమవారం సిఈఓతో పాటు ఇంజనీర్లు ఘటనా స్థలానికి చేరుకొని డ్రైనేజీ పైప్‌లైన్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సమస్య పరిష్కారానికి ఆర్మీ అధికారులతో చర్చించి పనులు పూర్తైయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు బాలక్రిష్ణ, ఫణికుమార్, శానిటరీ సిబ్బంది గణేష్ పాల్గొన్నారు.

# కబరస్థాన్, ఈద్గాకు మొక్కలు కేటాయించాలి



కమిషనర్ సత్యనారాయణరావుకు వినతి పత్రం అందజేస్తున్న అక్బర్

దుండిగల్, జూన్ 26 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 8వ వార్డులో గల కబరస్థాన్, ఈద్గాకు హారితహారం మొక్కలు కేటాయించాలని కోరుతూ ఈద్గా అధ్యక్షులు మహమ్మద్ అక్బర్ సోమవారం కమీషనర్ సత్యనారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. ఈవిషయమై స్పందించిన కమీషనర్ ఈద్గా, కబరస్తాన్‌లో వెంటనే మొక్క లు ఏర్పాటు చేయాలని సంబంధిత విభాగానికి ఆదేశాలు జారీ చేయడం తో వారు 50 మొక్కలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అక్బర్ మాట్లాడుతూ మా వినతిని పరిశీలించి వెంటనే మొక్కలను ఏర్పాటు చేసిన కమీషనర్‌కు ముస్లింసోదరుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పచ్చదనం పెంపొందించడం వలన ఆహ్లాదకరణమైన కాలుష్యరహిత వాతావరణం నెలకొం టుందన్నారు. ఇందులో భాగంగానే ఈద్గా, కబరస్తాన్‌లలో మొక్కలను నాటుతున్నట్లు పేర్కోన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడుకుంటామన్నారు. అనంతరం ఈద్గా ప్రహరీ వద్ద కమిటి సభ్యులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో మహ్మద్ హాఫీజ్‌ఖాన్, మహ్మద్ సైఫ్, మహ్మద్ రషీద్, మహ్మద్ నవాజ్, మహ్మద్ సద్దాం, మహ్మద్ మిన్ను తదితరులు పాల్గొన్నారు.

# అంబర్‌పేటలో మహాజన్ సంపర్క్ అభిమాన్



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాగభూషణంచారి

హైదరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోగల సబ్ బాపునగర్, శక్తి కేంద్ర పరిధిలో అధ్యక్షుడు కోల పృధ్వీ, కొంక రవి ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ 119, 120లో ఇంటింటి ప్రచార కార్యక్రమం ముమ్మరంగా జరిగింది. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిధిగా బిజెపి డివిజన్ అధ్యక్షుడు దాసోజు నాగభూషణంచారి హాజరై ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో జరిగిన 9 ఏళ్ళపాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంపిణి చేశారు. పేదలకు, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి మోదీ చేసిన కృషిని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చా అసెంబ్లీ కన్వీనర్ సుంకరి వెంకటస్వామి, పోసెట్టి, నేందర్, ప్రవీణ్, సాయి, తేజ, సందీప్, సాయిరాం, శివ, బాబు తదితరులు పాల్గొన్నారు.

# బడా ఆలయం నుంచి భారీ కలశ శోభయాత్ర



సిక్‌వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఫిఠాది పతులకు స్వాగతం పలుకుతున్న బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్(బిలాల్)

గోషామహల్, జూన్ 26 ప్రభాతవార్త: సిక్‌వాల్ ప్రగతి సమాజ్ ఆద్వర్యంలో రాధాకృష్ణ, వేదమాతా, శృంగరిష్ మహారాజ్ విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వివిధ మతాల ఫిఠాధిపతులు విగ్రహాల ప్రాణ ప్రతిష్ట చేశారు. అంతకు ముందు బేగంబజార్ ఫీల్‌ఖాన పంచాయితీ బడా ఆలయం నుంచి భారీ కలశ శోభయాత్ర నిర్వహించారు. ఈశోభ యాత్రకు పరమ పూజ్య స్వామి కమలనాయంద్ దాస్‌జీ మహారాజ్(అయోధ్య), సచ్చిదానంద సరస వ్రతీ మహాస్వామి, జీమహారాజ్, త్రిదండి స్వామి శ్రీల్‌భక్తి భూషన్ బోదయన్ మహారాజ్, దామోదర్ గో స్వామిజీ మహారాజ్, డాక్టర్ సహ దేవ్‌దాస్‌జీ, ప్రభుదాస్ జీమహారాజ్, రాహుల్‌దాస్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, బేగంబజార్ కార్పొరేటర్ జి, శంకర్‌యాదవ్, గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్(బిలాల్), మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్, బిజెపి నాయకులు ఎం.విక్రమ్‌గౌడ్‌లు పాల్గొన్నారు. కలశ శోభయాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ శోభయాత్ర బేగంబజార్ నుంచి పుర వీధులో ఊరేగింపు కొనసాగింది. ప్రత్యేక గుర్రపు బగ్గీలలో ఆశీనులయ్యారు. అడుగుడున ఏర్పాటు చేసిన స్వాగత వేధికలపై కలశ శోభయాత్రకు భక్తులు పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో సికివాల్ సమాజ్ నాయకులు మోతీలాల్ తివారి, విష్ణు గోపాల్ తివారి, ఘన్‌శ్యామ్‌దాస్ ఉపాధ్యాయ, విజయ్‌పాండే, పవన్‌వ్యాస్‌తోపాటు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి వేషదారణలో గోపికల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణంగా నిలిచాయి.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు, స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండాలి

**మీరాలం ఎడిఇ వెంకటేష్ గౌడ్**

చార్మినార్, జూన్ 26 ప్రభాతవార్త : విద్యుత్ సరఫరా జరిగే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ తీగలు, స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండాలని టిఎస్ఎస్‌డిసిఎల్ మీరాలం ఆపరేషన్ ఎడిఇ వెంకటేష్ గౌడ్ కోరారు. విద్యుత్ భద్రత వారోత్సవాలు సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలం ప్రారంభం అయ్యిందని, బలమైన గాలులు వీచినప్పుడు ప్రజలు విద్యుత్ లైన్ల కింద ఉండ వద్దని, విద్యుత్ వైర్లు తెగినప్పుడు వెంటనే విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలని తెలిపారు. అదే విధంగా చేతులతో, ఇతర విద్యుత్ సరఫరా జరిగే పరికరాలు వాడితే విద్యుత్ షాక్ తగులుతుందని ఆయన తెలియజేశారు. ప్రధానంగా వర్షాలు కురిసిన సమయంలో విద్యుత్ స్తంభాలు, సిమెంట్, ఐరన్ స్టీల్ స్తంభాలకు చాలా దూరం గా ఉండాలని, చేతితో ముట్టుకోవద్దని ఆయన కోరారు. పిల్లలు విద్యుత్ పరకరాలకు దూరంగా ఉండాలని, అదే విధంగా విత్యుత్ సిబ్బంది, ప్రైవేట్ విద్యుత్ కార్మికులు ఎలక్ట్రీషియన్ పనులు చేసే వారు తప్పని సరిగా ఎర్త్ రాడ్, చేతి గ్లాసులు, హెల్మెట్ పరికరాలు విధిగా ధరించి స్తంభాలు, విద్యుత్ లైన్లపై పని చేయాలని ఆయన కోరారు. హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలపై ప్రతే ్యకంగా ఏర్పాటు చేసిన కంట్రల్ రూమ్ ఫోన్ నెంబరు 9491628269ను వినియోగదారులు సంప్రదించాలని మీరాలం ఎడిఇ వెంకటేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# మేదరి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మురళీకృష్ణ



మేదరి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీకృష్ణను అభినందిస్తున్న పులి జగన్, లింగంగౌడ్ తదితరులు

హైదరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త : తెలంగాణ మేదరి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.మురళీకృష్ణ ఎన్నికయ్యారు. ఆయన ఇందుకు ముందు మేదరి సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. అలాగే మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించాడు. అంబర్‌పేట నియోజకవర్గంలో సీనియర్ బిఆర్ఎస్ నాయకుడైన మురళీకృష్ణ తెలంగాణ బిసి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. సోమవారం అంబర్‌పేటలోని మేదరి సంఘ భవన్‌లో ఆయన అభిమానులు, స్నేహితులు మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు. అంబర్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ పులి జగన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు లింగంగౌడ్, తెలంగాణ రాష్ట్ర బిసి జాగృతి నాయకులు పిల్లి బలరాజ్, మేదరి సంఘం నాయకులు నోమలు కిషన్, రాములు పాల్గొన్నారు.

# కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న ముదిరాజ్ నేతలు

సికింద్రాబాద్, జూన్ 26 ప్రభాతవార్తః బాధ్యతగల పదవిలో ఉంటు ఓ వీడియో జర్నలిస్టును దుర్భాషాలాడడంతో పాటు కెమెరాను టాక్కోని దాడికి పాల్పడడం ఎమ్మెల్సీ పాడే కౌశిక్ రెడ్డిని వెంటనే ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించాలని ముదిరాజ్ సంఘం తెలంగాణ నాయకులు డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయి ముదిరాజ్ కులాన్ని దూషించడం పట్ల తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి కౌశిక్ రెడ్డిపై తక్షణ చర్యలు తీసుకోకపోతే ముదిరాజ్ సమాజం తగిన బుద్ది చెబుతుందని అన్నారు. పార్సిగుట్ట చౌరస్తాలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కనకయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ముదిరాజ్ నేతలు, కార్యాకర్తలు పెద్దయెత్తున ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు, మేకల సారంగపాణి, సతీష్‌రాజ్, హనుమంతు, ఓంప్రకాశ్, క్రాంతి, రాజ్ ముదిరాజ్, వెంకటేష్, యాదగిరి, రవీందర్ తదితర ముదిరాజ్ నేతలు పాల్గొన్నారు.

# ఆనాథ ఆశ్రమంలో అల్పాహారం పంపిణీ



విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న బిల్డర్ ప్రవీణ్‌కుమార్, విజయ్

హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త: అంబర్‌పేట్ నియోజకవర్గంలోని టిఆర్టీ క్వార్టర్స్‌లోగల బాలల అనాథ ఆశ్రమంలో టిడిపి డివిజన్ నాయకుడు ముత్యాల విజయ్ ఆధ్వర్యంలో చిన్నారులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి టిడిపి అంబర్‌పేట్ నియోజకవర్గ ఇంచార్జ్ రాష్ట్ర అధికార ప్రతినిది బిల్డర్ ప్రవీణ్‌కుమార్ ముఖ్యఅతిధిగా పాల్గొని చిన్నారులకు వడ్డించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాచర్ల భాస్కర్, సత్యనారాయణ, ఏడెల్లి భాను ప్రకాశ్, విజయ్, జాఫర్, ధనరాజ్, పరమేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి కెటిఆర్ కార్యక్రమానికి తరలివెళ్లిన కార్పొరేటర్ శ్రేణులు



నాచారం నుంచి మంత్రి కేటీఆర్ కార్యక్రమానికి వెళ్లుతున్న కార్పోరేటర్ శాంతిసాయిజన్ శేఖర్

నాచారం, జూన్ 26 ప్రభాతవార్త: ఉప్పల్ చౌరస్తాలో ప్రారంభమైన ఉప్పల్ స్కైవే ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ ప్రారంభోత్సవానికి నాచారం డివిజన్ కార్పేటేటర్ శాంతి సాయిజన్ శేఖర్ ఆద్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించినన ర్యాలీని కార్పోరేటర్ జెండా ఊపి ప్రారంభించారు. 150 బైకులు, 36 ఆటోలతో నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

# నాలా మహాసభల్లో మర్రి రమేశ్ ఇంద్రజాల ప్రదర్శన

చిక్కడపల్లి, జూన్ 26 ప్రభాతవార్త: ఐదు దశాబ్దాలపాటు ఇంద్రజాల ప్రదర్శనలతో ప్రశంసలందుకుంటున్న ప్రఖ్యాత ఇంద్రజాలీకుడు మర్రి రమేశ్ భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలు దాటి విదేశాల్లో నెల రోజుల పాటు ప్రదర్శనలు ఇచ్చేందుకు అమెరికా దేశానికి బయలుదేరివెళ్లారు. శంకర నేత్రాలయ (అమెరికా), నార్త్ అమెరికా తెలుగు సంఘం(నాటా) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు మహాసభల్లో జూలై 1న 'మర్రి మాయాజాల్' ప్రదర్శన ఇవ్వనున్నారు. డల్లాస్ నగరంలోని టెక్సాస్‌లో జూన్ 30 నుంచి జూలై 2వ తేదీ వరకు ఈ ప్రదర్శనలు జరుగుతా యని రమేశ్ వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో సీనియర్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న మర్రి రమేశ్ తెలంగాణ మేజిక్ అకాడమి అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని పలు నగరాల్లో మర్రి రమేశ్ ప్రదర్శనలు ఇవ్వడం విశేషం.

# జూలై 16న హెచ్‌సిసిఎంఎ ఎన్నికలు



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ అధ్యక్షులు సుభాస్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్ కుమార్ అగర్వాల్

చార్మినార్, జూన్ 26 ప్రభాతవార్త : పాతబస్తీ రికాబ్‌గంజ్‌కు చెందిన ది హైదరాబాద్ కట్ పీస్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు జూలై నెల 16వ తేదీన జరగనున్నాయని అసోసియేషన్ అధ్యక్షులు సుభాష్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్ కుమార్ అగర్వాల్‌లు తెలిపారు. రికాబ్‌గంజ్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతీ రెండు సంవత్సరాలకు ఒక సారి ఎన్నికలు జరుగుతాయని, జూలై 16వ తేదీ ఆదివారం ఉదయం అబిడ్స్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో అసోసియేషన్ సమావేశం జరుగుతుందని అనంతరం ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. మహేష్ కోఆపరేటివ్ అర బ్న్ బ్యాంక్ చైర్మన్ రమేష్ కుమార్ బంగ్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని వారు తెలియజేశారు. ఐదు వందల మంది సభ్యులు అసోసియేషన్ ఎన్నికల్లో పాల్గొంటున్నారని వారు తెలిపారు.

# గూగుల్‌లో దొరికే వాటిని కాకుండా.. జీవితాలను ఉదాహరణలుగా బోధించాలి

**ప్రముఖ గణితవేత్త పద్మశ్రీ ఆనంద్‌కుమార్**



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో ఆనంద్‌కుమార్, రీతుషా

హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త: గూగుల్ సెర్చ్‌లో సులభంగా దొరికే వాటిని ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించవద్దని, ఇలాంటి పరిశోధనలల్లో కనిపించడని జీవిత ఉదహారణలను బోధించాలని ప్రముఖ గణితవేత్త, పద్మశ్రీ ఆనంద్‌కుమార్ అన్నారు. ఫిక్కిలేడిస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కోహినూర్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 300మంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఎల్ఓ చైర్మపర్సన్ రీతూషాతోపాటు ఆయన వారితో సంభాషించారు. ఈసందర్భంగా పలువిషయాలపై బహిరంగంగా మాట్లాడారు. డబ్బుతోపాటు సూపర్ 30 ఎడ్యూకేషన్ ప్రోగ్రాం నడిపించడంలో మాఫియాతో పోరాడటం అతిపెద్ద సవాలు అన్నారు. తను బెదిరింపు వచ్చాయని .తన బోధనేతర సిబ్బందిని కూడా ఇబ్బందిపెట్టారన్నారు. కోచింగ్ సెంటర్లకు ఫీజుల చెల్లించలేని ఐఐటిల కోసం చూసే నిరుపేద పిల్లలకు శిక్షణ ఇవ్వడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత 21 సంవత్సరాలుగా సూపర్ 30 ప్రోగ్రాం కొనసాగించడంలో ఎదుర్కొన్న సవాళ్లను విద్యార్థులకు వివరించారు. ఎఫ్ఎల్ఓ చైర్ పర్సన్ రీతుషా మాట్లాడుతూ ప్రపంచలో దేనినైనా మార్చలగల శక్తివంతమైన ఆయుధం విద్య అని, విద్య అనేది భవిష్యత్‌పై పెట్టుబడి అన్నారు. విద్యమహిళలకు ఎంతో శక్తి ఇస్తుందని పేర్కొన్నారు.

# అక్రమార్కులను నుండి భూమిని కాపాడాలి: స్థానికుల నిరసన



సంజయ్ గాంధీ నగర్‌లో సంక్షేమ సంఘానికి చెందిన భూమిని కబ్జా దారుల నుంచి కాపాడాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న సంక్షేమ సంఘం నాయకులు, స్థానికులు

యూసుఫ్‌గూడ, జూన్ 26, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎల్లాంరెడ్డిగూడ సంజయ్ గాంధీనగర్ సంక్షేమ సంఘానికి సంబందించిన భూమిని కొంత మంది ఆక్రమించు కునేందుకు ప్రయత్నిస్తున్నారని వారినుంచి భూమిని కాపాడాలంటూ స్థానికంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. అయితే బస్తీలో ఉన్నటువంటి స్థలాన్ని జిహెచ్ఎంసి అధికారులు కొంతమంది తోపుడు బండ్ల వారికి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కేటాయించారని ఆప్రదేశంలో ఎలాంటినిర్మాణం లేకపోయినప్పటికి ఇంటినెంబర్‌లను కూడా కేటాయించారని పేర్కొన్నారు. సంజయ్ గాంధీనగర్ బస్తీకి చెందిన లేఅవుట్ 1975లో ఏర్పాటు చేయడం జరిగిందని అందులో పార్కు కోసం స్థలాన్ని కేటాయించారని కొంత మంది అధికారుల ప్రోద్భలంతోనే ఈస్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గత 45 సంవత్సరాలుగా ఈ స్థలాన్ని తమ సంక్షేమ సంఘాలు, స్థానికులు కాపాడుతూ వస్తున్నారని 1987 లో దివంగత మాజీ ఎమ్మెల్యే పి జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిదులు కేటాయించి కమ్యూనిటీ హాల్‌ను కూడా నిర్మించడం జరిగిందని పేర్నొన్నారు. ఈకబ్జాల విషయమై ప్రశ్నించినందుకు కొంతమంది అధికారులు అక్రమంగా కేసులు పెడుతున్నారని ఇదే విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆ స్థలానికి చెందిన పూర్తి వివరాలను, ఆధారాలను జతపర్చి పోలీసులకు ఇవ్వడం జరిగిందని అందుకు వారు పూర్తిగా దర్యాప్తుచేసి న్యాయం చేసే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గొంటి శ్రీనివాస్ యాదవ్, సలహదారుడు కుమార్ చౌదరి యాదవ్, ఉపాధ్యక్షుడు బి లక్ష్మణ్, కిరణ్ యాదవ్, నాగరాజు, హరీష్ యాదవ్ బస్తీ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

# శాశ్వత ప్రేమకు నిదర్శనం రాంజీ-సోన్దేవి నాటకం

రవీంద్రభారతి, జూన్ 26 ప్రభాతవార్త : ప్రేమే శ్యాశ్వతమని భావించే స్వచ్ఛమైన ప్రేమికులు ఒకరులేనిదే మరొకరు జీవించలేరని, ఎంతటి త్యాగాలకైనా సిద్ధమేనని తెలియజెప్పిన ఒక జంట ప్రేమకు నిదర్శనమే రాంజీ-సోన్దేవి నాటకం. ప్రముఖ సాంస్కృతిక, రంగస్థల సేవాసంస్థ రసరంజని హైదరాబాద్ ఆధ్వర్యంలో టిక్కెట్టుకొని నాటకం చూడాలన్న భావనను ప్రేక్షకులతో ప్రోదికొల్పుతూ ప్రతీనెలా ఒక నాటకం ప్రేక్షకుడికి వినోదం, నటులకి ఆనందం- అదే మాబాట, మామాట నినాదంతో ముందుకుపోతూ ఈ నెల ప్రదర్శనలో భాగంగా సోమవారం రాత్రి 6.30గంటల నుండి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో బ్రిడ్జ్ థియేటర్ వారి సమర్పణలో గడ్డం ప్రశాంత్ రచన-నాటకీకరణ, వి.వికాస్ చైతన్య రూపకల్పన, దర్శకత్వంలో గోండు, కోలం రెండు తెగలకు చెందిన గిరిజనులు అడవిలో వాగుకు ఇరువైపుల ఉన్న గూడెంలు హద్దుగా జీవిస్తూ వారు వేటకు వెళ్లినప్పుడు గొడవలుపడడం, పెద్దలు వారించడం పరిపాటి. ఇంతలో ఆకాడి పండుగ రావడం... గోండు తెగకు చెందిన రాంజీ కోలాం తెగకు చెందిన సోన్దేవి ఆ పండుగ జాతరలో ఒకరికొకరు ప్రేమించుకోవడం, ఈ ఇరువురు అడవి పూజారి దాసరి సోమ్లానాయక్‌కు విషయం జెప్పడం.. పెళ్లి ద్వారానైనా ఇరుతెగల కుటుంబాలు కలుస్తాయన్న ఆశతో పూజారి పెద్దలకు తెలియకుండా గుడిలో వారి పెళ్లిచేయడం ... ఈ విషయం పెద్దలకు తెలిసి జరిగిన గొడవలు... భర్తను కలిసే నాటకీయంలో సోన్దేవి స్పృహకోల్పోయినట్లు నటించాల్సి రావడం, నటనని తెలియక సోన్దేవి మరణించిందని రాంజీ కత్తితో పొడుచుకొని మరణించడం, ఆవార్త తెలిసి సోన్దేవి కూడా అదే కత్తితో పొడుచుకొని మరణించడం కథాంశంగా రాంజీ-సోన్దేవి నాటకాన్ని నటీనటులు అనూష, ప్రణయ్, సాయికిరణ్, హేమంత్, ప్రశాంత్, సంజన, సాయిదీపిక, అర్జున్ తదితరులు వారివారి పాత్రల్లో అద్భుతంగా నటించి అధికసంఖ్యలో విచ్చేసిన నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకుల హర్షద్వానాలతో శుభాశీస్సులందుకొని నాటక ప్రదర్శనను విజయవంతం చేశారు.

# క్రికెట్ క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ



క్రికెట్ క్రీడాకారుల కోసం టి-షర్టులను ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ పి.మమతసంతోష్‌గుప్త

గన్‌ఫౌండ్రి, జూన్ 26ప్రభాతవార్త: హైదరాబాద్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటిలను లాల్‌బహదూర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు టిఆర్ఎస్ నాయకులు పి.సంతోష్‌గుప్త, మాజీ కార్పొరేటర్ పి.మమత సంతోష్‌గుప్తలు తెలిపారు. సోమవారం లాల్‌బహదూర్ స్టేడియంలో క్రికెట్ క్రీడాకారులు ధరించే టీ-షర్టులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నితీష్ నంద్‌కర్ పాల్గొన్నారు.

# జల్సాలకోసం తప్పుడు మార్గాలవైపు యువత

పార్టీల పేరుతో వల..

కొందరకు స్నేహితుల ద్వారా కొత్తవారిని పరిచేయం చేసుకుని విందులు వినోదాల పేరుతో పార్టీలకు ఆహ్వానిస్తున్నారు. ఇలా రెండు మూడు సార్లు వీరితో పరిచయం పెరిగిన తర్వాత ఆర్థిక అవసరాలున్న వారిని చీకటి వ్యాపారానికి ఉపయోగించుకుంటున్నారు. ఆమీర్‌పేట్, కూకట్‌పల్లి, మైత్రీవనం, చైతన్యపురి, దిల్‌షుక్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్ వంటి ప్రాంతాలకే ఒప్పుడు హాస్టళ్లు పరిమితమయ్యేవి. ప్రస్తుతం దాదాపు నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఇళ్లను వసతిగృహాలకు అద్దెకు ఇచ్చేస్తున్నారు. దీంతో ఎవరికీ అనుమానం రాకుండా ఉండే ప్రాంతాల్లోని హాస్టళ్లలోనే గంజాయి ఎగుమతి దిగుమతులకు స్థావరంగా వినియోగిస్తున్నారు. దిల్‌షుఖ్‌నగర్, షేక్‌పేట్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో వసతి గృహాల్లో ఉంటున్న పలువురు విద్యార్థులు ఆబ్కారీశాఖ దాడుల్లో దొరికారు. వీరు ఉన్నత చదువులకోసం నగరానికి వచ్చినట్లు దర్యాప్తులో తేలింది. పలువురు విద్యార్థులకు మత్తుకు బానిసై నేరాలకు పాల్పడుతున్నారు.

**వసతి గృహాల్లో ఉంటూ లావాదేవీలు**

**మత్తుమురాల ఉచ్చులో పడి జైలుపాలవుతున్న వైనం**

**మత్తు సేవిస్తూ నేరాలకు పాల్పడుతున్న వైనం**

హైదరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త : నగరంలో గంజాయి అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. అక్రమార్కులు యువతే ప్రధాన టార్గెట్‌గా గంజాయి చేరవేస్తున్నారు. నిత్యం ఏదో ఒక చోట గంజాయి పట్టుబడుతూనే ఉంది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి అమ్ముతున్న స్థావరాలపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో 210 కిలోల గంజాయి, ఒక కియా కారు, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు 60 లక్షలకు పైగా ఉంటుందని డిసిపి సందీప్‌రావు తెలిపారు.

ఉన్నత చవుదువుల కోసం కొందరు..ఉద్యోగాల కోసం మరికొందరు..ఇలా నగరానికి వచ్చిన యువకులను, విద్యార్థులను కొందరు గంజాయి, మారకద్రవ్యాల వ్యాపారులు చీకటి వ్యాపారాలకు వినియోగించుకుంటున్నారు. గ్రేటర్ పరిధిలో చాలా వసతి గృహాల్లో పలువురు విద్యార్థులు, నిరుద్యోగులు ఉంటున్నారు. వీరి ఆర్థిక అవసరాలను తెలుసుకుని వారి వ్యాపారలావాదేవీలకు వాడుకుంటున్నారు. గంజాయి, విదేశీ మద్యం వంటివి ఒకచోటు నుంచి మరొక చోటికి సరఫరా చేసేందుకు వీరిని వినియోగించుకుంటున్నారు. గంజాయి బ్యాగ్‌ను ఒకప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి తరలిస్తే రూ.3వేల నుంచి 5వేల వరకు ఇస్తున్నారు. ఇలా నెలకు నాలుగైదు సార్లు ఈకార్యకలాపాలకు పాల్పడుతూ డబ్బును ఆర్జిస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయాన్ని జల్సాలకు వినియోగిస్తూ వక్రదారి పడుతున్నారు. అలాగే పలువురు విద్యార్థులు గంజాయి రుచి చూసి దానికి బానిసై పోతున్నారు. ఉన్నత చదవులకోసం నగరానికి వచ్చి గంజాయి మురాల ఊబిలో చిక్కుకుని జైలుపాలవుతున్న విద్యార్థులు ఎంతోమంది ఉన్నారు. తమ పిల్లలు ఇలాంటి ఉచ్చులో చిక్కుకుంటున్నారని చాలామంది తల్లిదం డ్రులకు తెలియదు. పోలీసులకు చిక్కి కేసులపాలయ్యాక వెలుగులోకి వస్తున్నాయి.

**కేసుల్లో చిక్కుకుంటున్నారు..**

గ్రేటర్ పరిధిలో విదేశీమద్యం, గుట్కా, గంజాయి వంటి నిషేదిత వస్తువుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గంజాయి, గుట్కా వంటి వాటిని ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి దిగుమతి అవుతుంది. ఇక్కడకు వచ్చిన వాటిని ఆకర్ష నీయంగా ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈవిషయంపై పోలీసులు పలు ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు నిరంతరం చేస్తున్నారు. గత కొన్ని నెలల్లో వందలాది మంది ని పట్టుకున్నారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు, నిరుద్యోగులే ఉండటాన్ని చూసి అధికారులు విస్తుపోతున్నారు. అయితే వీరు దొరికి వెంటనే వారి వెనుక ఉండే కీలక వ్యక్తులు జాగ్రత్త పడుతున్నారు. తమకు ఎటువంటి సంబంధం లేనట్లు తప్పించుకుంటున్నారు. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులపై కేసులు నమోదువుతున్నాయి. నగరంలో ఒంటరిగా ఉంటున్న పిల్లలపై తల్లిదం డ్రులు కాస్త దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

# అక్రమ నిర్మాణమంటూ టౌన్‌ప్లానింగ్ అధికారుల కూల్చివేతలు


రహదారిపై భైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న సామ, కొప్పుల

**మన్సూరాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** మన్సూరాబాద్ డివిజన్‌లోని శ్రీరామ్ నగర్‌కాలనీ ప్రధాన రహదారి ప్రక్కన అక్రమంగా నిర్మిస్తున్న దుకాణ సముదాయల షెడ్‌ను టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం ఉదయం కూల్చివేశారు. డివిజన్‌లో ఎలాంటి అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేదిలేదని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. కాగాదుకాణా సముదాయల నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని అందుకే ఈ కూల్చివేతలని వారు పేర్కొన్నారు.

**కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కూల్చివేతలు...**

మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కూల్చివేతలని, పేదలను సైతం వదలడం లేదని రంగారెడ్డి

**కక్ష సాధింపుతోనే కూల్చివేతలు : బిజెపి నాయకుల ఆందోళన**

జిల్లా అర్బన్‌బిజేపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి దుయ్యబట్టారు. శ్రీరామ్‌నగర్ కాలనీలో కూల్చివేతలను వారు తీవ్రంగా ఖండిస్తూ సహారాకు వెళ్లే ప్రధాన రహదారిపై స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, ఎల్‌బినగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్‌లతో పాటు బిజేపి నాయకులు భైఠాయించి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజేపి నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇటీవల ఒక బిసి కులానికి చెందిన కార్యకర్త ఇళ్ళు నేలమట్టం చేయడంలో ఎమ్మెల్యేతో పాటు స్థానికి బిఆర్‌ఎస్ నాయకుల హస్తం ఉందన్నారు. కేవలం కక్ష సాదింపు చర్యల్లో భాగంగానే కార్పొరేటర్ మద్దతు దారులంటూ అపోహ పడి పేదవారని కూడ చూడకుండా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులను అడ్డం పెట్టుకుని కూల్చివేతలు చేయడం సిగ్గుచేటన్నారు. చిన్నచెరువులో అక్రమ నిర్మాణాలతో పాటు నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు ఎమ్మెల్యే పాల్పడుతున్నారంటూ తాము ప్రశ్నిస్తుంటే వాటిని ఎదుర్కొలేకనే ఇలాంటి కూల్చివేతలకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. నియోజకవర్గంలో జరిగే అవినీతిని ఎప్పుడూ ప్రశ్నిస్తామని, బిఆర్‌ఎస్ నాయకల అక్రమాలను బిజెపి మాత్రమే ఎదుర్కొంటుందని వారు తెలిపారు. ఈ నిరసనలో నాయకులు నాంపల్లి రామేశ్వర్, పల్లె గణేష్‌గౌడ్, శ్రీదర్‌గౌడ్, హరిష్‌రెడ్డి, యాదగిరి, సాయిరాంగౌడ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలి : కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త :** కాలనీవాసులకు ఇబ్బందిగా మారిన రోడ్డు మరమ్మతులను వెంటనే చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.కొత్తపేట ఈస్ట్ మారుతి నగర్ రోడ్‌నెంబర్ 8లో డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వి నిర్మాణం పనులు పూర్తి అయిన అనంతరం రోడ్డును నిర్మించకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని సోమవారం ప్రభాతవార్తలో ప్రచురితమైన 'డ్రైనేజీ పైప్‌లైన్ పనుల నిర్మాణం పూర్తి.. తవ్విన రోడ్డును పూడ్చడం మరిచిన అధికారులు' కథనానికి కార్పొరేటర్ స్పందించి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు సమస్యను గురించి కార్పొరేటర్ వివరించారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ వెంటనే రోడ్డు మరమ్మత్తులు చేపట్టకపోవడంతో కాలనీ రోడ్డు పూర్తిగా గుంతలుగా మారిందని దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వర్షాకాలంలో రోడ్డు మరమ్మతులు చేపట్టకపోతే మరింత ఇబ్బందిగా ఉంటుందని వెంటనే రోడ్డు మరమ్మత్తు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ఈ పర్యటనలో కాలనీవాసులు సంజీవరావు, నాయకులు మంచి రాజేష్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే బలాల


అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, జూన్ 26 ప్రభాతవార్త :** రానున్న బక్రీద్ పండుగ దృష్ట్యా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. బక్రీద్‌ను పురస్కరించుకుని గ్రేటర్ పారిశుద్ధ్య విభాగం, ఎంటమాలజీ తదితర విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే బలాల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాలం షాహిద్, అధికారులు జయంత్, గోవింద్‌రెడ్డి, నాయకులు అబ్రార్, అలీం తదితరులు పాల్గొన్నారు.

## ముంపు సమస్య పరిష్కారానికి ప్రణాళిక ప్రతిపాదనలు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సమస్య వివరిస్తున్న రాహుల్‌గౌడ్ తదితరులు

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త :** ముంపు సమస్య పరిష్కరించేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేశామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ ప్రజయ్‌నివాస్ ఫేస్1లో కాలనీవాసుల కోరిక మేరకు సోమవారం ఎమ్మెల్యే కాలనీలో పర్యటించారు. ఇతర కాలనీల నుంచి వచ్చే వరదనీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వరదనీరు బయటకు వెళ్లడానికి సరైన ఔట్‌లెట్ లేకపోవడంతో వరదనీరు తమ కాలనీని ముంచెత్తుతోందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా పలు సమస్యలను కూడా వివరించి వాటిని వెంటనే పరిష్కరించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.అందుకు స్పందించిన సుధీర్‌రెడ్డి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామని, అందులో భాగంగా వరదనీరు కాలనీలో నిలువకుండా సమీపంలో స్ట్రామ్‌వాటర్‌లైన్ నిర్మిస్తామని తెలిపారు. సుమారు 150మీటర్ల మేర నూతన లైన్ వేయడం జరుగుతుందని తెలిపారు. పనులు పూర్తి అయితే ఎలాంటి వరదనీటి సమస్యలు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ తెరాస పార్టీ అధ్యక్షులు లింగాల రాహుల్‌గౌడ్, నాయకులు ఒరుగంటి వెంకటేష్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, సాయిగౌడ్, శరన్, మలాతి, కాలనీ వాసులు రామారావు,ప్రసాద్, లింగేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అకారణంగా హెల్మెట్‌తో కొట్టిన వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష

**మలక్‌పేట, జూన్ 26 ప్రభాతవార్త :** అకారణంగా ఓ వ్యక్తిని తిట్టి, హెల్మెట్‌తో కొట్టిన వ్యక్తికి 2 రోజులు జైలు శిక్ష వేసిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మలక్‌పేటవద్ద ఓ దుకాణదారుడు షాప్ బంద్ చేసుకుని ఇంటికి వెళుతుండగా లంగర్‌హౌజ్‌కు చెందిన బి.శివ రాపిడో బైక్‌పై వెళుతూ దుకాణదారుని అకారణంగా తిడుతూ, హెల్మెట్‌తో కొట్టాడు. దీంతో బాధితుడు చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా నాంపల్లి 4వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ 2 రోజులు జైలు శిక్ష విధించారు.

## దేశాభివృద్ధికి దిక్సూచి ప్రధాని మోడి : కొలన్


మోడి పథకాలను ప్రజల్లో ప్రచారం చేస్తున్న శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడి పాలనలో దేశం ఆర్థికంగా ప్రపంచంలోనే బలోపేతమై 5వ స్థానంలో నిలిచిందని తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గసభ్యుడు, సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ పరిధిలో 5వ రోజు సోమవారం ఇంటింటికి బిజెపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పోలింగ్ బూత్‌ల వారీగా పార్టీ శ్రేణులతో కలిసి పాద యాత్రలు చేస్తూ పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రధాన మోడి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధికి దిక్సూచి ప్రధాని నరేంద్ర మోడి పాలన అని అన్నారు. కేంద్రంలో మాదిరిగా రాష్ట్రంలో కూడా బిజెపికి ఒక సారి అధికారం ఇచ్చి చూడాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామిడి శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కరుణాకర్, నరేష్, లక్ష్మారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కృషి : అనితానాయక్


చైర్‌పర్సన్ అనితానాయక్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ జాదవ్

**మలక్‌పేట, జూన్ 26 ప్రభాతవార్త :** రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్ పేర్కొన్నారు. మహారాష్ట్రలకు చెందిన మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌జాదవ్ ఆ రాష్ట్రానికి చెందిన రైతులతో కలిసి మలక్‌పేట మహబూబ్‌మాన్షన్ మార్కెట్‌లో చైర్‌పర్సన్, అధికారులు, డైరెక్టర్లతో కలిసి పర్యటించారు. తాము పండించిన సరుకును మార్కెట్‌కు తీసుకువచ్చే రైఉతలకు మెరుగైన గిట్టుబాటు ధరను అందిస్తున్నామని చైర్‌పర్సన్ అనితానాయక్ వివరించారు. నగర పరిధిలోని మార్కెట్లలో అన్నిసౌకర్యాలను కల్పించి అభివృద్ధి చేసి అధునాతనంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమంకోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం హర్షవర్ధన్‌జాదవ్ మాట్లాడుతూ మార్కెట్లకు వచ్చే రైతులకు మంచి గిట్టుబాటు ధరను అందించడం అభినందనీయమని మార్కెట్‌కమిటీ అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎస్ దామోదర్, గ్రేడ్ 3 కార్యదర్శి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు మైల రవికాంత్, బట్కిరి విద్యానంద్, నరేష్, అభిషేకం, సల్మాన్‌ఖాన్, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ ఉపాధ్యక్షుడు చేకూరి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, ఆనియన్ అసోసియేషన్ కార్యదర్శి దుగ్గు జగదీష్, వెంకటేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతి కళ్యాణ మండపం పార్కులో వీది దీపాల ఏర్పాటుకు చర్యలు : అరుణ


ఎఇకి సూచనలు చేస్తున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, జూన్ 26 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ పరిధిలోని పద్మావతి కళ్యాణ మండపం పార్కులో అదనంగా వీది దీపాలను ఏర్పాటు చేస్తామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎఇతో కలిసి పార్కును పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామరాజు, ఉపాధ్యక్షురాలు నీరజ తదితరులు పాల్గొన్నారు.

## ట్యాక్స్ చెల్లించి తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి

**తుర్కయంజాల్, జూన్ 26 ప్రభాతవార్త :** తుర్కయంజాల్‌లోని తులిప్స్ గ్రాండ్ హోటల్‌కు చెందిన 2023-24 సంవత్సర ట్యాక్స్ రూ.5,34,928 (ఐదు లక్షల ముప్పై నాలుగు వేల తొమ్మిది వందల ఇరవై ఎనిమిది రూపాయలు) చెక్కును భవన యజమానులు కొత్తకుర్మ సత్తయ్య, కందాడ లక్ష్మారెడ్డి సామ సంజీవరెడ్డి, తాటిచెట్టు అశోక్‌గౌడ్ తదితరులు మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ప్రజలు తమ ఇంటి, వాణిజ్యపన్నులను సకాలంలో చెల్లించి, పురపాలక అభివృద్ధికి దోహద పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది నగేష్, మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను పూర్తి చేయాలని జీఎం సునీల్‌కుమార్‌కు వినతి : కార్పొరేటర్ శ్రావణ్


జీఎంకు సమస్యలను తెలియజేస్తున్న కార్పొరేటర్ శ్రావణ్, కాలనీవాసులు

**నేరెడ్‌మెట్, జూన్ 26 ప్రభాతవార్త:** 140డివిజన్ పరిధిలోని బలరాంనగర్‌లో పెండింగ్‌లో ఉన్న పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలని సోమవారం స్థానిక కార్పొరేటర్ శ్రావణ్ కాలనీ వాసులతో కలసి సైనిక్‌పురిలోని వాటర్ వర్క్స్ కార్యాలయంలో జీఎం సునీల్ కుమార్‌ను కలిసి కోరడం జరిగింది. అనంతరం కార్పొరేటర్ శ్రావణ్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో గత కొంతకాలంగా పైప్‌లైన్ పనులను పెండింగ్‌లో ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సానుకూలంగా స్పందించిన జీఎం సునీల్ కుమార్ త్వరలోనే పనులను చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు గోపాల్ సింగ్, నెల్సన్, సర్పరాజ్, అద్వైత్ కుమార్, వేణు, రవి తదితరులు పాల్గొన్నారు.

## సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తాం : కౌన్సిలర్ విద్యావతి


కాలనీవాసుల సమస్యలను తెలుసుకుంటున్న కౌన్సిలర్

**హయత్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** ప్రతి కాలనీలో కనీస సదుపాయాలను కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వవార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆమె వార్డుపరిధిలోని నిత్యఅవెన్యూ కాలనీలో పర్యటించి కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. కాలనీకి కృష్ణనీటిని అందించాలని, వీధి దీపాలు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కౌన్సిలర్‌ను కోరారు. దీనిపై కౌన్సిలర్ స్పందిస్తూ... అధికారులతో మాట్లాడి సమస్యలను సాధ్యమయినంత త్వరగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కానలీ అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రతినిధులు గణేష్, వెంకట్‌రెడ్డి, అలేఖ్య, మల్లారెడ్డి, వినోద్‌బాబు, వేణుగోపాల్, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

## మహిళలపై పెరిగిన లైంగిక వేధింపులు: సిపిఐ

**సరూర్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** బిజెపి పాలనలో దేశంలో మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి ఆందోళన వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని లెనిన్‌నగర్‌లో ఉన్న మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సిపిఐ కార్యాలయంలో సోమవారం మహిళా కామ్రేడ్ రజియా బేగం అధ్యక్షతన మహిళా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గడచిన 9 సంవత్సరాల్లో దేశంలో మహిళలపై అత్యాచారాలు, వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులను ఆయన ఖండించారు. వారి పోరాటానికి సిపిఐ మద్దతు ఇచ్చిందని అన్నారు. అన్ని రకాల నిత్యావసరాల ధరల పెరుగుదలతో ముఖ్యంగా మహిళలు ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. కాగా ఈ సదస్సులో మహిళల రక్షణ, ధరల తగ్గింపు, మహిళా హక్కులు తదితర అంశాలపై తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి వెంకట రమణారెడ్డి, మహిళా కామ్రేడ్లు మిరియాల లక్ష్మమ్మ, సుజాత, డి.పద్మలతో పాటు నరేందర్, పిచ్చి రాజు, దేరంగుల శంకర్, షక్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 31తేదీ లోపు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో అడ్మిషన్లు పొందాలి

**హయత్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ(బిఏ, బీకాం, బీఎస్సీ)కోర్సులలో చేరడానికి జులై 31 వరకు గడువు కలదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జోత్స్నప్రభ, అభ్యాసకుల సహాయ కేంద్రం కో-ఆర్డినేటర్ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సులలో చేరడానికి విద్యార్థులు, ఫీజు తదితర వివరాలను www.braouonline.inలో పొందిపరిచినట్లు వివరించారు. ఇంటర్మీడియెట్, నేషన్ ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ పూర్తిచేసిన వారు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులలో 2023వరకు పాసైన విద్యార్థులు నేరుగా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ద్వితీయ, తృతీయ, సంవత్సర విద్యార్థులు కోర్సు ఫీజును జులై 31లోగా చెల్లించాలన్నారు.వివరాలకు 79974 96295, 73829 29771 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

## జీఓ 59 కొత్త దరఖాస్తుల విచారణ షురూ

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త :** జీవో59 క్రింద ఉప్పల్ మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో 2020 జూన్ 2 కంటే ముందు నిర్మించుకున్న అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు సంబంధించి 347 దరఖాస్తులను తహసీల్దార్ కె.గౌతమ్‌కుమార్ ప్రారంభించారు. మండలంలోని ఉప్పల్ బాగాయత్ 12, ఉప్పల్‌ఖాల్సా 106, రామంతాపూర్ 17, మల్లాపూర్ 56, నాచారం 6, మీర్పేట్ 07, హబ్సిగూడ 01, బండ్లగూడ 23, ఫతుల్లగూడ 83, కొత్తపేట 19, నాగోల్ 17 దరఖాస్తులు వచ్చాయని తహసిల్దార్ తెలిపారు. వాటిని వారంరోజుల్లో 2 బృందాలు విచారణ చేస్తాయని దరఖాస్తుదారులు టీమ్ సభ్యులు తెల్పిన తేదీకి వారి ఇంటి వద్ద భూమి, ఇంటికి సంబందించిన పత్రాలతో అందుబాటులో ఉండాలని విజ్ఞప్తి చేశారు. రెండవ విడతలో డిమాండ్ నోటీసులు తీసుకొని డబ్బులు చెల్లించని సుమారు 150 మంది లబ్ధిదారులు బ్యాంకులో చాలాన్లతో డబ్బులు జమచేస్తే వెంటనే రిజిస్ట్రేషన్లు చేస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఈకార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఎండి.రఫీయొద్దీన్, సర్వేయర్ ప్రశాంత్, వీఆర్‌ఏ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కాలనీ బాధితులకు బిజెపి ఆర్థిక సహాయం


బాధితులను పరామర్శిస్తున్న సామ రంగారెడ్డి, రంగ నరసింహగుప్తా

**ఎల్.బి.నగర్, జూన్ 26 ప్రభాతవార్త :** చైతన్యపురి డివిజన్ మున్సిపల్‌కాలనీలోని రంగనాయక్ కుటుంబ సబ్యులను బిజెపి నాయకులు సోమవారం పరామర్శించారు. ఇంటి పైకప్పు కూలడంతో నలుగురు కుటుంబ సబ్యులకు గాయాలు కాగా సమాచారం తెలిసిన రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి, చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నరసింహగుప్తాలు సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించి కొంత నగదును ఆర్థిక సహాయం చేశారు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని అందుకు సహాయం కూడా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధ్యక్షుడు వినోద్‌యాదవ్, మల్కాజిగిరి కన్వీనర్ పెరిక కృష్ణప్రకాష్, హరిబాబు, ఉదయ్‌కుమార్, కొల్లూరు నవీన్, అర్జున్‌సింగ్, సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్మికుడి మృతి మేయర్ చిగురింత పారిజాత నివాళి


కార్మికుడు సత్తయ్య భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జూన్ 26 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు వాచ్‌మెన్‌గా పని చేస్తున్న కార్మికుడు దండుగుల సత్తయ్య తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామ పంచాయతీలు ఉన్నప్పటి నుండి చాలా కాలంగా ఆయన కార్మికునిగా పని చేశారు. అయితే తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో స్పందించిన మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డిలు సుల్తాన్‌పూర్‌కు వెళ్ళి సత్తయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి కార్పొరేషన్‌తరపున అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నేనావత్ బాలునాయక్, నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, మార్ల బాబు, వరికుప్పల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట


కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న ఐలయ్య తదితరులు

**తుర్కయంజాల్, జూన్ 26 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నదని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కౌన్సిల్ ఫ్లోర్‌లీడర్ కోసికే ఐలయ్య, కమిషనర్ సాబేరి ఆలీ అన్నారు. సోమవారం తుర్కయంజాల్ కమ్మగూడ ఇంద్రమ్మ కాలనీ 22వ వార్డు పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వజనుల ఆరోగ్యమే లక్ష్యంగా అందత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు పథకం చేపట్టిందన్నారు. కంటిపరీక్షలు చేసి దృష్టిలోపం ఉన్నవారికి కళ్లద్దాలు ఇవ్వడం జరిగింది. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యులు సలహాలు, సూచనలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకుమాను చెన్నయ్య, రాజునాయక్, ఇందిరమ్మ కాలనీ అధ్యక్షులు హనుమంత్‌గౌడ్,వేముల శంకర్, గిరి, కొండయ్య, నల్లవెల్లి వెంకటేష్, శ్రీనివాస్, అజయ్‌గౌడ్,శ్రీశైలం, శంకర్‌నాయక్, వెంకటేష్‌యాదవ్, సూపర్‌వైజర్ నరసింహ, ఉమా, సరిత విజయ తదితరులు పాల్గొన్నారు.


మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలో పలు కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పునర్నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ (ప్రభాతవార్త, కుషాయిగూడ)

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి


ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేస్తున్న తారిఖ్ అన్సారి, అమ్జదుల్లాఖాన్ తదితరులు

**మలక్‌పేట, జూన్ 26 ప్రభాతవార్త :** విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ కమిషనర్ ఛైర్మన్ తారిఖ్ అన్సారి, ఎంబిటి అధికార ప్రతినిధి అమ్జదుల్లాఖాన్‌లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 12వ అబ్దుల్ జబ్బార్ ఖాన్ నగదు పురస్కారాల ప్రధానం కార్యక్రమాన్ని మలక్‌పేటలోని మెరిడియన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు అత్యధిక మార్కులు సాధించిన 10వ తరగతి విద్యార్థులకు రూ. 50 వేలు, 10 వేలు, 5 వేల చొప్పున అందజేశారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. 25 వేలు, 15 వేలు, 10 వేలు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమైందని, పట్టుదలతో శ్రమించి తమ లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలి : ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక

**నేరెడ్‌మెట్, జూన్ 26 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తి చేయాలని ప్రజా సంఘాల ఐక్యపోరాట వేదిక డిమాండ్ చేసింది. సోమవారం మల్కాజిగిరి తహశిల్దార్ కార్యాలయం ముందు ప్రజా సంఘాల ఐక్య పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహశిల్దార్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మల్కాజిగిరి మండల పరిధిలో ఎంతో మంది నిరుపేదలు పలు సంక్షేమ పథకాలకు ధరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. అర్హత ఉండి కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కోసం వేలమంది ఎదురు చూస్తున్నారని తెలిపారు. లబ్ది పొందని వారిని చూసి లబ్ది పొందని వారు ఎంతో నిరాశకు గురవుతున్నారని తెలిపారు. వారి సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. దళితులకు దళితబంధు అందించాలన్నారు. నిరుపేదలకు డబల్ బెడ్ రూం ఇళ్ళు కేటాయించాలని కోరారు. అర్హతఉండి దరఖాస్తు చేసుకునే వారికి దరఖాస్తు చేసుకొని అవకాశం కల్పించాలన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బీ.సి ఆర్థిక సహాయం గడువు పెంచి అర్హులైన ప్రతిఒక్కరికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య పోరాట వేదిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.